

జనజీవనమే 'జానపదం'

సమాజంలో జానపదాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నేడు ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 10లో



బ్రాహ్మణుల అభ్యున్నతికి...

బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఓటర్ల ముసాయిదా జాబితాను అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో గతంలో ఉన్న 1,439 పోలింగ్ బూత్‌లకు తోడు కొత్తగా 16 కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే, 64 పోలింగ్ కేంద్రాల స్థానం మార్చినట్లు చెప్పారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో 11,77,687మంది ఓటర్లు ఉండగా, పురుషులు 5,73,406, మహిళలు 6,04,203, ఇతరులు 78మంది ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా సర్వీస్ ఓటర్లు 683మంది అదనంగా ఉన్నారని వెల్లడించారు. జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకు వచ్చే నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈనెల 26, 27వ తేదీలతో పాటు వచ్చేనెల 2, 3వ తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ వెల్లడించారు.

నృసింహుడికి అభిషేకం



పూజల్లో పాల్గొన్న ఈఓ దంపతులు, భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని ప్రాచీన దివ్యక్షేత్రమైన శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 16వ వార్షిక పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామికి అభిషేకం నిర్వహించగా, అగ్ని ప్రతిష్ట, నవ కుంభారోహణ, నవగ్రహ పూజ, మహాశాంతి నిర్వహించారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో అర్చకులు, పండితులు పవిత్రోత్సవాలు నిర్వహిస్తుండగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో 24న స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.ప్రత్యూష తెలిపారు. బాలురు, బాలికలకు ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని కేటగిరీల బాలురకు వివిధ కోర్సుల్లో 156, బాలికలకు 74 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నిర్దేశిత సమయంలో హాజరు కావాలని సూచించారు.


విద్యార్థులను తీర్చిదిద్దాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు వెనుకబాటు నుంచి బయటకు వచ్చేలా పాఠ్యాంశాల్లో తీర్చిదిద్దేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మూడు రోజుల పాటు జరగనున్న 'ఉన్నతి' శిక్షణ, 10వ తరగతి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై హెచ్‌ఎంలకు ఏర్పాటుచేసిన శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కోర్స్ డైరెక్టర్ సామినేని సత్యనారాయణ మాట్లాడగా, రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి పరిశీలించారు. కోర్స్ కోఆర్డినేటర్ నారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పాఠశాలలకు అందిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఉద్యోగులతో సమావేశమై అవగాహన కల్పించారు. జిల్లా ప్లానింగ్ అధికారి రామకృష్ణ, స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ భానుప్రకాష్, అసిస్టెంట్ ప్రోగ్రామర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.


ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు కృత్రిమ కాలు



సీపీతో కానిస్టేబుల్ నవీన్, అధికారులు

ఖమ్మంక్రైం: కారేపల్లి మండలం చీమలపాడులో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కాలు కోల్పోయిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్‌కు కృత్రిమ కాలు అమర్చారు. పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ చొరవ తీసుకుని జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో రూ.9లక్షల విలువైన హైడ్రాలిక్ డ్యాంపర్‌తో కూడిన కృత్రిమ కాలు చేయించారు. ఈ సందర్భంగా సీపీని సోమవారం కలిసిన నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీ ప్రసన్నకుమార్, సీఐలు చిట్టిబాబు, ఆర్‌ఐ శ్రీశైలం పాల్గొన్నారు. కాగా, కమిషనరేట్‌లో సోమవారం సీపీ వారియర్ గ్రీవెన్స్ డేలో భాగంగా ఫిర్యాదులు వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రేసు గుర్రాలు..



ఉమ్మడి జిల్లాలో పది స్థానాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన

- వైరాలో మాత్రమే ఎమ్మెల్యేకు మొండిచేయి
- సర్వేలే గీటురాయిగా మదన్‌లాల్‌కు టికెట్
- మరో నాలుగు స్థానాల్లో ఆశావహులకు ఝలక్
- అన్ని స్థానాల్లో అభ్యర్థుల ప్రకటనతో 'గులాబీ'ల్లో జోష్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎలాంటి సస్పెన్స్‌కు తావివ్వకుండా ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు బీఆర్‌ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. పదింట్లో వైరా మినహా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, గతంలో పోటీ చేసి ఓటమి చెందిన వారికే మళ్లీ అవకాశం కల్పించింది. సర్వే నివేదిక ఆధారంగా వైరాలో సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను కాదని మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌ని పోటీలోకి దింపింది. ఇక పాలేరు, భద్రాచలం, ఇల్లెందు, కొత్తగూడెం స్థానాల్లో టికెట్ ఆశించిన వారికి భంగపాటు తప్పలేదు. ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు జోష్‌లో ఉండగా.. అభ్యర్థులు ఇక రేసు గుర్రాల్లా ఎన్నికల కార్యక్షేత్రంలోకి దూకేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్‌ఎస్ అనూహ్యంగా పది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో ప్రతిపక్ష పార్టీలకు ముందస్తుగానే సవాల్ విసిరినట్లయిందని భావిస్తుండగా.. అభ్యర్థుల ప్రకటనతో బీఆర్‌ఎస్ ఎన్నికల సమర భేరి మోగించినట్లయింది.

పక్కా ప్రణాళికతో..

బీఆర్‌ఎస్ ఎన్నికల రాజకీయ కార్యక్షేత్రంలో 2014, 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఒక్కో స్థానాన్ని మాత్రమే గెలుచుకుంది. గత అనుభవాల ఆధారంగా పక్కా ప్రణాళికతోనే సీఎం కేసీఆర్ టికెట్ల ప్రకటన ముందుగా చేసినట్లు తెలుస్తోంది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులు.. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌తో సీఎంతో పాటు మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ పలుమార్లు చర్చించారు. అలాగే, మూడు నెలలుగా చేసిన సర్వే నివేదికల ఆధారంగా టికెట్లు ఇచ్చినట్లు తెలిసింది.

సంచలనానికి తావివ్వకుండా..

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా వెలువడుతుందన్న ప్రచారం వారం రోజులుగా జరుగుతుండడంతో ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ కొనసాగింది. కొన్ని స్థానాల్లో సిట్టింగ్‌లను మారుస్తారని భావన వ్యక్తం కావడంతో ఆశావహులు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పువ్వాడను కలవడం ప్రారంభించారు. కొందరు తమ సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వొద్దని కూడా కోరారు. పాలేరు, వైరా, ఇల్లెందు, కొత్తగూడెంల్లో సిట్టింగ్‌లు, మాజీల వర్గాల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. వీటన్నింటిని పక్కన పెట్టిన గులాబీ బాస్, ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వే నివేదిక ఆధారంగా సంచలనాలకు తావివ్వకుండా ఒకేసారి పది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో జిల్లాలోని మిగతా పార్టీలకు షాక్ ఇచ్చినట్లయింది.

పదింట సమరమే..

గత ఎన్నికల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను బరిలోకి దింపగా.. ఈసారి సైతం ఎలాంటి పొత్తులు లేకుండా అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్, పాలేరు నుంచి కందాల ఉపేందర్ రెడ్డి, మధిర నుంచి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందులో బానోతు హరిప్రియనాయక్, పినపాకలో రేగా కాంతారావు, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట నుంచి మెచ్చా నాగేశ్వరరావును పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. కొంత కాలంగా జరుగుతున్న ప్రచారానికి అనుగుణంగానే వైరా స్థానం విషయంలో గులాబీ బాస్ కేసీఆర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను కాదని ఈ స్థానంలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్‌ను పార్టీ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. సర్వే నివేదికల ఆధారంగానే ఈ మార్పు జరిగినట్లు తెలిసింది.

రెట్టింపు అభివృద్ధి చేస్తా...



మంత్రి పువ్వాడకు స్వీట్ తినిపిస్తున్న మేయర్ నీరజ, పక్కన గుండాల కృష్ణ

మళ్లీ నన్ను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే ఇప్పుడు జరిగిన అభివృద్ధి కంటే రెట్టింపు చేస్తా. నాకు టికెట్ కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. నేను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగా. ఖమ్మం ప్రజలందరూ నా కుటుంబ సభ్యులే. ప్రజలకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించాం. ఖమ్మంలో పార్కులు, లకారం ట్యాంక్‌బండ్, గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ, రహదారుల విస్తరణ, ఓపెన్‌జిమ్, పబ్లిక్ టాయిలెట్స్ ఇలా అనేక పనులు చేశా. ఇంకా పలు కొత్త ఆలోచనలు నా మదిలో ఉన్నాయి. అందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు గెలిపించుకుని సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తాం.

– పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

వారికి భంగపాటు..

ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టికెట్ తమకే వస్తుందని భావించిన వారికి భంగపాటు తప్పలేదు. పాలేరు నుంచి తనకే టికెట్ వస్తుందని చెప్పుకొచ్చిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేసీఆర్‌ను పొగుడుతూ ప్రకటనలు చేశారు. ఇంతలోనే సిట్టింగ్ ఎమ్మెల్యే కందాల పేరు ప్రకటించడంతో తుమ్మల వర్గం కంగుతిన్నట్లయింది. వైరా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా తానే మళ్లీ పోటీలో ఉంటానని రాములునాయక్ నిబ్బరంగా ఉన్నా.. ఈ స్థానంలో మదన్‌లాల్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈ విషయంలో జరుగుతున్న ప్రచారంతో రాములునాయక్ ప్రగతిభవన్‌కు వెళ్లి టికెట్ తనకే ఇవ్వాలని అభ్యర్థించినా నిరాశే ఎదురైంది. ఇక ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు కొందరు ఫిర్యాదు చేసినా అధిష్టానం ఆమెవైపే మొగ్గు చూపింది. ఇక కొత్తగూడెం స్థానం విషయంలోనూ చివరి వరకు సస్పెన్స్ కొనసాగింది. వనమాపై కోర్టు కేసు నేపథ్యాన ఒకసారి గడల శ్రీనివాసరావు, మరోసారి జలగం వెంకట్రావుకు టికెట్ ఇస్తారంటూ ప్రచారం గుప్పుమంది. అయినప్పటికీ సీనియారిటీ ప్రాతిపదికన వనమాకే టికెట్ కట్టబెడుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఏం చేద్దాం కామ్రేడ్స్?!

- బీఆర్‌ఎస్ దూకుడుతో ఉభయ కమ్యూనిస్టులకు షాక్
- పొత్తు ఉంటుందని ఆశించినా నిరాశే
- కలిసి పోటీ చేసే దిశగా త్వరలోనే చర్చలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించేసింది. దీంతో ఇన్నాళ్లు బీఆర్‌ఎస్‌కు ఉభయ కమ్యూనిస్టులతో పొత్తు ఉంటుందని జరిగిన ప్రచారానికి తెరపడింది. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కొనసాగిన చెలిమి వచ్చే ఎన్నికల్లోనూ ఉంటుందన్న రాజకీయ ప్రచారం తారుమారైంది. ప్రధానంగా బీఆర్‌ఎస్ ప్రకటించిన జాబితాతో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండలో ఉభయ కమ్యూనిస్టులకు ఇక పొత్తుకు ఆస్కారం లేకుండా పోయింది. ఈ నేపథ్యాన బలమైన స్థానాల్లో కలిసి పోటీ చేయాలని సీపీఎం, సీపీఐ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. నేడో, రేపో రాజధాని వేదికగా సమావేశమై స్థానాల విషయమై ఓ కొలిక్కి రానున్నట్లు తెలిసింది.

కుదరని చెలిమి

బీఆర్‌ఎస్‌తో పొత్తు పొడిస్తే రాష్ట్రవ్యాప్తంగా చెరో పది స్థానాల్లో పోటీ చేయాలని సీపీఎం, సీపీఐ ఆలోచించాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల వల్లే బీఆర్‌ఎస్‌కు విజయం దక్కిందని, సాధారణ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌తో పొత్తుతో అసెంబ్లీలో అడుగు పెడతామని భావించారు. ఈ క్రమంలోనే సీట్ల కేటాయింపుపై చర్చలు కూడా కొనసాగించాయి. కానీ నల్లగొండలో మునుగోడు, ఉమ్మడి ఖమ్మంలో భద్రాచలం స్థానాన్ని సీపీఐ, సీపీఎంకు ఇస్తామని.. ఆపై చెరో ఒకటి లేదా రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని బీఆర్‌ఎస్ చేసిన ప్రతిపాదనలను ఉభయ కమ్యూనిస్టులు జీర్ణించుకోలేకపోయారు. చివరకు చెరో మూడు స్థానాల్లోనైనా పోటీకి పొత్తు కుదురుతుందని ఆశించాయి. కానీ బీఆర్‌ఎస్ ఎలాంటి పొత్తులు లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో కమ్యూనిస్టులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. తమకు బలమున్న ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఒక్క స్థానాన్ని కూడా వదలకుండా బీఆర్‌ఎస్ జాబితాలో ప్రకటించడంతో పొత్తు ఆశలు పూర్తిగా గల్లంతైనట్లయింది.

ఉమ్మడిగా పయనం

బీఆర్‌ఎస్ ఇచ్చిన షాక్‌తో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఉమ్మడిగా కలిసి పోటీ చేయాలనే దిశగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. 2014, 2018 ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు పార్టీలు ఒకే తాటిపై నడవలేదు. ఈసారి కనక ఉమ్మడిగా పయనిస్తే తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి పొత్తు కుదిరినట్లవుతుంది. ప్రధానంగా ఉభయ కమ్యూనిస్టులు ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లోని మెజార్టీ స్థానాల్లో పోటీ చేయాలనే దిశగా చర్చలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరితే ఉమ్మడి ఖమ్మంలోని పాలేరు, ఖమ్మం, మధిర, భద్రాచలం స్థానాల్లో సీపీఎం, కొత్తగూడెం, పినపాక, వైరా స్థానాల్లో సీపీఐ బరిలో దిగే అవకాశమున్నట్లు ఆ పార్టీల శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. మొత్తంగా బీఆర్‌ఎస్ ఇచ్చిన ఝలక్‌తో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అంతర్మథనంలో మునిగి.. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ కార్యాచరణ ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎందుకు మొండిచేయి?

రాములునాయక్‌కు టికెట్ దక్కకపోవడానికి అనేక కారణాలు

వైరా: రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మినహా అన్ని స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను బీఆర్‌ఎస్ ప్రకటించింది. అయితే, ఖమ్మం జిల్లాలో పది స్థానాల్లో వైరా తప్ప అందరూ పాత అభ్యర్థులకే చోటు కల్పించారు. ఈమేరకు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు టికెట్ రాకపోవడంపై రకరకాల ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంపై ఐదేళ్లుగా ఆయన పట్టు సాధించకపోవడం, బలమైన కేడర్ ఆయన పక్షాన నిలవకుండా మాజీ ఎంపీ పొంగులేటి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ వైపు ఉన్నట్లు అధిష్టానం గుర్తించిందని సమాచారం. కార్యకర్తలకు అండగా నిలవకపోగా, ఏ పనిపై వెళ్లినా కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న తన కుమారుడిని కలవాలని సూచిస్తారనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు యూనిట్ల కేటాయింపులో నగదు వసూళ్లు జరిగినట్లు ప్రచారం జరిగింది. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను మొక్కుబడిగా నిర్వహించడం, కేడర్‌ను ఆహ్వానించకుండా నిర్లక్ష్యం వహించినట్లు చెబుతున్నారు. అలాగే, నామినేటెడ్ పోస్టులు, అధికారుల నియామకం విషయంలోనూ ఎమ్మెల్యే వైఖరిని పలువురు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అంతేకాక ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో వివాదస్పద వాఖ్యలు చేయడం, మున్సిపాలిటీలో పార్టీ కౌన్సిలర్లే ప్రభుత్వంపై నిరసన తెలపడం వంటి కారణాలకు తోడు పార్టీ నిర్వహించిన సర్వేల్లో రాములునాయక్‌కు వ్యతిరేకంగా నివేదికలు రావడంతోనే అధిష్టానం టికెట్ కేటాయించలేదని తెలుస్తోంది.

లక్కు... కిక్కు!



డ్రా తీసి నంబర్ చూపిస్తున్న సీపీ వారియర్, పక్కన ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

- సిండికేట్లదే మళ్లీ పైచేయి
- మద్యం దుకాణాల టెండర్లు ఖరారు
- మొదటి దఫా ఫీజు రూ.వెయ్యి కోట్లు చెల్లించిన వ్యాపారులు

ఖమ్మంక్రైం: ఈ ఎక్సైజ్ పాలసీలో కూడా సిండికేట్లదే పైచేయిగా నిలిచింది. జిల్లాలోని మద్యం వ్యాపారులు ఆరు నుంచి ఏడు సిండికేట్లు ఏర్పడగా సగానికి పైగా మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. జిల్లాలోని 122 వైన్స్ కేటాయింపునకు టెండర్లు ఖరారు చేసేందుకు జిల్లా కేంద్రంలో సోమవారం డ్రా నిర్వహించారు. సీపీ విష్ణు ఎస్.వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్ పాల్గొని డ్రా తీసి మాట్లాడారు. జిల్లాలోని రఘునాథపాలెం మండలం షాపు నంబర్-1కు మొదటగా డ్రా తీయగా బల్లేపల్లికి చెందిన వెంకన్న దక్కించుకున్నారు.

సగానికి పైగా వారికే..

జిల్లాలో చక్రం తిప్పుతున్న సిండికేట్ల బాధ్యులు ప్రాధాన్యత గల మద్యం దుకాణాల్లో సగానికి పైగా దక్కించుకున్నారు. ఒక్కో సిండికేట్ తరఫున 20నుంచి 30మంది దరఖాస్తులు వేయించినట్లు సమాచారం. అయితే, ఏపీలోని వ్యాపారులకు ఈసారి ఆశించిన స్థాయిలో షాపులు రాకపోవడంతో డిమాండ్ ఉన్న షాపులను రూ.కోటికి పైగానే వెచ్చించి కొనుగోలుకు బేరసారాలు ప్రారంభించారు. ఓ వ్యాపారి సుమారు 30 షాపులకు దరఖాస్తులు వేయగా ఒకటే షాపు రాగా... మరికొందరికి ఆ షాపు కూడా రాకపోవడంతో హాల్‌లో పరిస్థితి గంభీరంగా కనిపించింది. కాగా, జిల్లాలో అత్యధిక దరఖాస్తులు వచ్చిన వెంకటగిరి క్రాస్ రోడ్డులోని షాపు నంబర్ 36ను యదాల వెంకట్రావు దక్కించుకున్నాడు. ఆయన కూడా ఓ సిండికేట్ గ్రూప్‌లో సభ్యుడేనని సమాచారం. ఈసారి షాపులు దక్కించుకున్న వారు డిసెంబర్ 1వ తేదీ నుంచి వ్యాపారం మొదలుపెట్టాల్సి ఉంటుంది.

పోటెత్తిన వ్యాపారులు

వైన్స్ డ్రా నిర్వహించిన సీక్వెల్ రిసార్ట్స్‌కు ఉదయం 9గంటల నుంచే మద్యం వ్యాపారులు భారీగా చేరుకోన్నారు. దరఖాస్తుదారులను మాత్రమే లోపలకు అనుమతించటంతో వారి అనుచరులు, వాహనాలతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ కిక్కిరిసి కనిపించాయి. ఈమేరకు సివిల్, ఎక్సైజ్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి డ్రాలో గెలుపొందిన వారి పేర్లు చదువుతూ టోకెన్లు చూపించి సందేహాలకు తావు లేకుండా చేశారు. ఎక్సైజ్ సీఐలు రాజు, రాజిరెడ్డి, విజేందర్, పోశెట్టి, రమ్యారెడ్డి, సివిల్ సీఐలు స్వామి, కుమారస్వామి, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారితో డ్రాకు హాజరైన మహిళ

హాల్‌లోనే బ్యాంకు కౌంటర్లు

మద్యం డ్రా లో షాపులు దక్కించుకున్న వారు మొదటి విడతగా ఆయా ప్రాంతాల ఆధారంగా ఎక్సైజ్ శాఖకు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం డ్రా తీసిన హాల్‌లోనే మూడు బ్యాంకుల కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఇలా వ్యాపారులు ఒకే రోజుకు ప్రభుత్వానికి సుమారు రూ.వెయ్యి కోట్లు చలానా రూపంలో చెల్లించారు.

గర్భిణులకు సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని గర్భిణులకు ప్రభుత్వ పరంగా అందే వైద్యసేవలను విస్తృతం చేయాలని డీఎంహెచ్‌ఓ బి.మాలతి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పల్లె దవాఖానాల వైద్యులకు అసంక్రమిత వ్యాధుల నివారణ(ఎన్‌సీడీ)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గర్భిణీ వివరాలు నమోదు చేసి ప్రసవం అయ్యే వరకు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు ఎక్కువగా జరిగేలా కృషి చేస్తూ, వ్యాక్సినేషన్‌పై దృష్టిసారించాలని చెప్పారు. అలాగే వయోవృద్ధుల ఆరోగ్య కార్యక్రమాలు, మానసిక వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వరికూటి సుబ్బారావు, డబ్ల్యూహెచ్‌ఓ సీవీహెచ్‌ఓ డాక్టర్ సురేష్, పాలియేటివ్ కేర్ మెడికల్ ఆఫీసర్ బి.వెంకట్, డెమో సాంబశివారెడ్డి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ బి.మాలతి సూచించారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌పై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల బాధ్యులు అన్ని వివరాలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఐడీ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. మూడు రోజుల్లో ప్రకియ పూర్తి చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

క్లుప్తంగా

సత్తుపల్లికి పోటాపోటీగా దరఖాస్తులు

టికెట్ ఇవ్వాలని గాంధీభవన్‌కు ఆశావహులు



గాంధీభవన్‌లో దరఖాస్తు చేస్తున్న వక్కలగడ్డ సోమచంద్రశేఖర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆశావహులు టికెట్ల కోసం గాంధీభవన్ బాట పట్టారు. అయితే, సత్తుపల్లి నియోజకవర్గం నుంచే తొలుత దరఖాస్తులు మొదలయ్యాయి. రెండు రోజుల క్రితం మానవతారాయ్ దరఖాస్తు చేసుకున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి తనకు టికెట్ కేటాయించాలని సోమవారం వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కూడా గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. సత్తుపల్లి నుంచి మాజీ మంత్రి సంభాని, మట్టా దయానంద్, కొండూరు సుధాకర్‌తోపాటు మరికొందరు కూడా దరఖాస్తు చేయనున్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం కావడంతో ఎస్సీ ఎక్కువగా ఉన్నవారికే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ఆశావహుల నుంచి వస్తోంది. అలాగే, పాలేరు నియోజకవర్గం నుంచి ఎడ్ల శ్రీరాంయాదవ్ దరఖాస్తు చేశారు.

సెలవులో అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిలాష అభినవ్ వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. ఆమె రెండు నెలల పాటు సెలవు పెట్టినట్లు సమాచారం.

పరీక్షకు సర్వర్ సమస్య

గురుకుల పీజీటీ పరీక్ష రెండున్నర గంటలు ఆలస్యం

ఖమ్మంసహకారనగర్: గురుకులాల్లో పీజీటీల నియామకానికి సోమవారం ఇంగ్లిష్ పేపర్–3 పరీక్ష జరగాల్సి ఉంది. అయితే, సర్వర్ సమస్యతో ఉదయం 8.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉన్నా అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించలేదు. సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో 10.45 గంటలకు అనుమతించారు. ఖమ్మంలో సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థులకు కేంద్రాలు కేటాయించారు. సుదూర ప్రాంతాల నుంచి ముందుగానే అభ్యర్థులు వచ్చినా రెండు గంటలకు పైగా ఆలస్యం కావడంతో ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన చెందారు. చివరకు సమస్య పరిష్కరించడంతో అభ్యర్థులు ఊరట చెందారు.

పాలకుల తీరును ఎండగడదాం

ఖమ్మం సహకారనగర్: 'తిరగబడదాం... తరిమికొడదాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ పాలకుల తీరును ఎండగట్టేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి వచ్చేనెల 15 వరకు జరిగే 'తిరగబడదాం.. తరిమికొడదాం' కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిన హామీలను విషయాన్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొందయ్య పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు లేకపోతే అంతే...

11గంటలైనా ప్రారంభం కాని ప్రజావాణి



ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎవరూ లేని దృశ్యం

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోతే ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి(గ్రీవెన్స్ డే) ఆలస్యంగా మొదలవుతోంది. ఈ వారం కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిలాష సెలవులో ఉండగా, మరో అదనపు కలెక్టర్ మధుసూదన్ వైన్స్ టెండర్ల ప్రక్రియకు హాజరయ్యారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఉన్న సమయంలో ఉదయం 10–30గంటలకే గ్రీవెన్స్ డే మొదలవుతుంది. కానీ ఈసారి 11గంటల వరకు ఫిర్యాదులు తీసుకునే వారు లేక వివిధ ప్రాంతాల ప్రజలు వేచి ఉన్నారు. చివరకు 11గంటల తర్వాత జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు వచ్చి ఏఓ అరుణతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు.

అభివృద్ధి పథకాలపై అధ్యయనం

కల్లూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పథకాలు, ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు జిల్లాకు మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ అధికారులు వచ్చారు. మొత్తం 20మందితో కూడిన ఈ బృందంలో కొందరు కల్లూరు మండలం ముచ్చవరానికి సోమవారం చేరుకున్నారు. ఇందులో సందీప్ సింగాల్, పవన్, రావల్, అగర్వాల్, గార్కే, బి.మీనన్, ఎస్.కుమార్ ఉండగా మంగళవారం నుంచి గ్రామంలో అధ్యయనం చేస్తారు. వీరి వెంట ఎంపీడీఓ రవికుమార్, సర్పంచ్ వెంకటేశ్వరరావుతో పాటు వెంకటరామారావు, షరాబు వెంకటేశ్వరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పాత బలగమే...

జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా సిట్టింగ్‌లనే అధిష్టానం మళ్లీ ఖరారు చేసింది. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నుంచి ప్రస్తుతం ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్‌కుమార్, కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య పేర్లనే జాబితాలో చేర్చారు. అలాగే, మధిర నుంచి గత ఎన్నికల్లో ఓడిపోయి జెడ్పీ చైర్మన్‌గా ఉన్న లింగాల కమల్‌రాజ్ పేరు ఖరారు చేశారు. ఇక వైరాలో సిట్టింగ్‌ను మార్చినా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన బానోతు మదన్‌లాల్‌కు మళ్లీ టికెట్ కేటాయించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల బయోడేటాలు ఇలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

సత్తుపల్లి



పేరు : సండ్ర వెంకటవీరయ్య
స్వస్థలం : రాజుపేట, కూసుమంచి మండలం
పుట్టిన తేదీ : 1965 ఆగస్టు 15
కుటుంబం : భార్య మహాలక్ష్మి, కుమారులు భార్గవ్, తేజ
రాకీయ ప్రస్తానం : డిగ్రీ చదువుతున్న సమయంలోనే కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రభావితమై చదువు ఆపేసి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఎంల్లో చురుకైన పాత్ర వహించారు. 1994లో పాలేరు నుంచి సీపీఎం అభ్యర్థి పోటీ చేసిన ఆయన 25ఏళ్ల వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 1999లో సీపీఎం అభ్యర్థిగా, 2004 టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం పాలేరు నియోజకవర్గం జనరల్ కావడంతో రాజకీయ ప్రస్థానాన్ని సత్తుపల్లి(ఎస్సీ రిజర్వ్‌డ్)కు మార్చి 2009, 2014, 2018ల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల్లో విజయం తర్వాత సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్‌లో చేరారు.

వైరా



పేరు : బానోత్ మదన్‌లాల్
స్వస్థలం : ఈర్లపూడి, రఘునాథపాలెం మండలం
విద్యార్హత : బీఏ
కుటుంబం : భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్(ఐఏఎస్), కూతురు మనీషాలక్ష్మి
ప్రస్తానం : 1982–85 వరకు పండితాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేశారు. అనంతరం రాజకీయాలపై ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేశారు. 1996–2001, 2006–2001 వరకు ఈర్లపూడి సర్పంచ్‌గా పనిచేశారు. ఆతర్వాత 1999, 2004లో ఇల్లెందు నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించినా లభించలేదు. 2009లో వైరా నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఇండిపెండెంట్ అభ్యర్థి రాములునాయక్ చేతిలో ఓడిపోయారు.

మధిర



పేరు : లింగాల కమల్‌రాజు
తల్లిదండ్రులు : జ్ఞానయ్య, కరుణమ్మ
పుట్టిన తేదీ : 1971 జూన్ 15
స్వస్థలం : కొస్తాల, వైరా మండలం
విద్యార్హత : పీజీ (ఎకనామిక్స్)
కుటుంబం : భార్య వసంతరాణి (టీచర్)
ప్రస్థానం : విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో వివిధ హోదాల్లో పనిచేశారు. 1995లో వైరా మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1996లో డీవైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడిగా, 1996లో సీపీఎం మధిర డివిజన్ కమిటీ సభ్యుడిగా, 1998లో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2001 నుంచి 2005 వరకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా, 2001 నుంచి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా, 2004 నుంచి 2005 వరకు సీపీఎం వైరా మండల కార్యదర్శిగా పనిచేశారు. ఆతర్వాత 2005 డిసెంబర్‌లో వైరా నుంచి మధిరకు వచ్చారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మధిర నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క చేతిలో 1,417 తేడాతో ఓటమిపాలయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం తరఫున, 2015లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2016 మే 5న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి మల్లు భట్టి విక్రమార్క చేతిలో మూడోసారి ఓడిపోయారు. ఆ తర్వాత మధిర జెడ్పీటీసీ గెలుపొంది ప్రస్తుతం జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ఖమ్మం



పేరు: పువ్వాడ అజయ్‌కుమార్
చదువు : ఎమ్మెస్సీ అగ్రికల్చర్
కుటుంబం : భార్య వసంతలక్ష్మి, కుమారుడు నయన్‌రాజ్
రాజకీయ ప్రస్థానం : పువ్వాడ అజయ్‌కుమార్ తండ్రి నాగేశ్వరరావు సీపీఐలో సీనియర్ నేత. 2012లో వైఎస్సార్‌సీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన అజయ్, 2013 ఏప్రిల్ వరకు వైఎస్సార్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా, ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అనంతరం 2013లో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. 2014 ఏడాదిలో ఖమ్మం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. ప్రస్తుతం రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

పాలేరు



పేరు : కందాల ఉపేందర్‌రెడ్డి
తల్లిదండ్రులు : నర్సింహారెడ్డి, మోహినీదేవి.
పుట్టిన తేదీ : 1960 జనవరి 09
స్వస్థలం: రాజుపేట, కూసుమంచి మండలం
కుటుంబం : భార్య విజయమ్మ, కుమార్తెలు దీపిక, దీప్తి
విద్యార్హత : బీఎస్సీ
ప్రస్థానం : సివిల్ కాంట్రాక్టర్‌గా వృత్తిలో ఉన్న ఉపేందర్‌రెడ్డి కుటుంబానికి తాత, తండ్రుల కాలం నుంచి రాజకీయ నేపథ్యం ఉంది. 2018లో పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుపై విజయం సాధించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లో చేరారు. స్వతహాగా కందాళ ఫౌండేషన్ ద్వారా రూ.కోట్లు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులకు శుభాకాంక్షలు

ఖమ్మం మయూరిసెంటర్/వైరారోడ్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులుగా సీఎం కేసీఆర్ ప్రకటించిన నేతలకు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పదికి పది స్థానాలు గెలిచి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. సీఎం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు తోడు, ప్రజల ఆశీర్వాదంతో గెలుపు సాధ్యమవుతుందని తెలిపారు.

అభ్యర్థులు ఏమన్నారంటే....

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగనున్న తమ అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించింది. ఈ నేపథ్యాన ఆయా అభ్యర్థులను 'సాక్షి' పలకరించింది. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలో 01) ఎన్నోసారి పోటీ చేయబోతున్నారు, ఎలా ఫీల్ అవుతున్నారు.. 02) ఎన్నికల్లో ఏ నినాదంతో ముందుకెళ్తారు... 03) ఎన్నికల ప్రచారం ఎప్పుడు ప్రారంభిస్తారు.. 04) పార్టీలో అసమ్మతిని ఎలా ఎదుర్కొంటారు... 05) రాబోయే ఎన్నికల్లో మీ గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయనే ప్రశ్నలు అడగగా వారు వారు ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

● **సత్తుపల్లి : సండ్ర వెంకటవీరయ్య**

01) 1994 నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటున్నా. ఇప్పుడు ఏడోసారి పోటీ చేస్తున్నాను. ప్రజా జీవితంలో పని చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.
02) సత్తుపల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న పథకాలే ప్రచార అస్త్రాలు. రూ.వెయ్యి కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టా. గతంతో పోలిస్తే సత్తుపల్లి ఎలా ఉందో ప్రజలకు తెలుసు.
03) నిత్యం ప్రజల్లోనే ఉంటున్నా. ప్రచారం ప్రత్యేకంగా చేయాల్సిన పనిలేదు. అయినా లాంఛనంగా రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాను.
04) నియోజకవర్గంలో అసమ్మతి అనేది లేదు. అందరినీ కలుపుకుని వెళ్తున్నాను.
05) నూరుశాతం మళ్లీ సత్తుపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తా. నాలుగోసారి ప్రజల ఆశీర్వాదంతో విజయకేతనం ఎగురవేస్తా.

● **మధిర : లింగాల కమల్‌రాజ్**

01) పోటీ చేయడంఇది నాలుగో సారి. గత ఎన్నికల్లో ఓడినా కేసీఆర్ జెడ్పీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. మరోసారి పోటీ చేసే అవకాశం ఇచ్చిన సీఎంకు కృతజ్ఞతలు.
02) సంక్షేమం, అభివృద్ధి పథకాలే నాకు ప్రచారాస్త్రాలు. ఇక్కడ గెలిచిన ప్రతిపక్ష నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే విషయాన్ని వివరిస్తా.
03) ప్రత్యేకంగా ప్రచారం అనుకోలేదు. ప్రతిరోజు ప్రజల్లోనే తిరుగుతున్నా.
04) అసమ్మతి కాకుండా కేసీఆర్ హవా మాత్రమే ఉంటుంది. సమస్యలేవైనా ఉంటే సరిచేసుకొని ముందుకు వెళ్తాం.
05) నూటికి నూరు శాతం గెలుస్తాం. మధిర గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం.

● **వైరా : బానోతు మదన్‌లాల్**

01) వరుసగా నాలుగో సారి పోటీ చేయబోతున్నా. వైరా నియోజకవర్గం ఏర్పడ్డ తర్వాత ప్రతిసారీ పోటీలో ఉన్నా. చాలా సంతోషంగా ఉంది.
02) సీఎం కేసీఆర్ ప్రకటించిన అభివృద్ధి, సంక్షేమమే నినాదంగా ముందుకు వెళ్తా.
03) మంచి రోజు చూసుకుని త్వరలోనే ప్రచారం ప్రారంభిస్తాను.
04) బీఆర్ఎస్ పార్టీలో అందరమూ కలిసి పనిచేస్తాం. ఎమ్మెల్యే రాములునాయక్ సహకారంతో అందరినీ కలుపుకుంటూ రానున్న ఎన్నికలను ఎదుర్కొంటాం.
05) అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే నన్ను వంద శాతం గెలిపిస్తాయి.

● **పాలేరు : కందాల ఉపేందర్‌రెడ్డి**

01) ఎన్నికల్లో పోటీ చేయడం ఇది రెండోసారి.
02) సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలతో పాటు నియోజకవర్గంలోని చేసిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకెళ్తాను.
03) ప్రత్యేకంగా ప్రచారం ఏమీ ఉండదు. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నందున ఎన్నికలకు రెడీ అయినట్లే.
04) పార్టీలో అసమ్మతి లేదు. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతాను.
05) ప్రజల ఆశీర్వాదంతో వచ్చే ఎన్నికల్లోనూ తప్పకుండా నేనే గెలుస్తా. ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదు.

– సాక్షి నెట్‌వర్క్

ఆరోగ్యశ్రీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

మంత్రి పువ్వాడకు వినతి



మంత్రి పువ్వాడ అజయ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, తదితరులు

ఖమ్మం వైద్యవిభాగం: అర్హతల ఆధారంగా పోస్టులు కేటాయించి రెగ్యులరైజ్ చేయడమే కాక వేతనాలు పెంచి ఆదుకోవాలని ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ సిబ్బంది కోరారు. ఈమేరకు సోమవారం ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్నా పనికి తగిన గుర్తింపు లేనందున స్పందించాలని కోరారు. ఉద్యోగ యూనియన్ అధ్యక్షుడు కె.వినయ్‌తో పాటు పవిత్ర, ఉషారాణి, కరుణజ్యోతి, సీతావరమ్మ, దుర్గాప్రసాద్, గోపి, నాగేశ్వరరావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోండి

ఖమ్మం సహకారనగర్: జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ ఆధ్వర్యాన సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సిబ్బందిని వేధిస్తున్నారని తెలిపారు. ఆయన చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్దేశపూర్వకంగా టీఎన్జీవోస్ నాయకులకు వేసిన డిప్యుటేషన్లు రద్దు చేయించాలని కోరారు. టీఎన్జీవోస్ బాధ్యులు జీ.ఎస్.ప్రసాదరావు, శ్రీనివాస్, ఫిరంగి శ్రీను, హబీబ్, శాబాసు జ్యోతి, స్వప్న, బుద్దా రామకృష్ణ, ఖాసిం, నారాయణ, ఆర్.ఎన్.ప్రసాద్, రత్నాకర్, సాయికృష్ణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందని గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) నాయకులు మంత్రిని కలిసి విన్నవించారు. ఈ విషయమై టీజీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు ఖాజామియా, రమేష్, శేషప్రసాద్ బి.వెంకటేశ్వర్లు, నయీంపాషా, గణేష్, జినక వెంకన్న, రామకృష్ణ, రమణ, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి



రహదారి పనులను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసర్ షేక్ రజాక్ సూచించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులను మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లి, బోదులబండ సమీపంలో సోమవారం ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పవర్ మెక్ కార్యాలయంలో అధికకారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ సూర్యాపేట – ఖమ్మం, కోదాడ – ఖమ్మం, ఖమ్మం – దేవరపల్లి, వరంగల్ – ఖమ్మం, ఖమ్మం – విజయవాడ ఐదు జాతీయ రహదారుల నిర్మాణ పనులను వేగంగా సాగుతున్నాయని తెలిపారు. గడువు తగ్గించినందున పనుల్లో మరింత వేగం పెంచుతున్నట్లు చెప్పారు. నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, జిల్లా మేనేజర్ జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రాధాన్యత

- వేలాది ఆలయాలకు డీడీఎన్ పథకం
- బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ
- హాజరైన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అజయ్‌కుమార్, పక్కన ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: బ్రాహ్మణుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఉమ్మడి జిల్లా స్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం సోమవారం రాత్రి ఈశ్వరప్రగడ హరిబాబు అధ్యక్షతన ఖమ్మంలో జరిగింది. ఈ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని తెలిపారు. అలాగే, హైదరాబాద్‌లో బ్రాహ్మణ సదనం నిర్మించగా, విదేశీ విద్యనభ్యసించేందుకు రూ. 20 లక్షల వరకు చేయూత ఇస్తున్నారని చెప్పారు. దూపదీప నైవేద్య పథకం ద్వారా వేలాది ఆలయాల్లో పూజలు సాఫీగా సాగేలా నెలనెలా నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. గృహలక్ష్మి పథకం ద్వారా పేద బ్రాహ్మణులకు ఇళ్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, మున్సిపల్ కార్పొరేషన్‌లో బ్రాహ్మణులకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామని మంత్రి తెలిపారు. కాగా, రానున్న ఎన్నికల్లో జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులందరినీ ఆశీర్వదించాలని కోరారు. అలాగే, దేశం క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న సమయాన పీవీ.నర్సింహారావు ప్రధానిగా చేపట్టిన సంస్కరణలతో గాడిన పెట్టారని పువ్వాడ గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక బ్రాహ్మణ సమాజానికి గుర్తింపు లభించిందని తెలిపారు. బ్రాహ్మణ సమాజ అభివృద్ధి, అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈసందర్భంగా అర్చకులు, పురోహితులకు ద్విచక్రవాహనాలు ఇవ్వాలని, రెండు పడకల ఇళ్లు ఒక బ్లాక్‌లో కేటాయించాలని, బ్రాహ్మణ సంక్షేమ భవనం నిర్మాణం పూర్తిచేయించాలని, అన్ని ఆలయాలకు దూపదీప నైవేద్య పథకం అమలుచేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. కాగా, బ్రాహ్మణ ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మంత్రి అజయ్‌కుమార్‌కు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని వెల్లడించారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, నాయకులు గుండాల కృష్ణ, మామునూరి మురళీధర్ రావు, మల్లాది వాసుదేవరావు, రఘునాథా చార్యులు, ఎస్‌వీకే.ఆచార్యులు, కోదండ రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయసాయం



జీవనసంధ్య ఆశ్రమంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ఖమ్మంలీగల్ / ఖమ్మం రూరల్: పిల్లల నుంచి నిరాదరణకు గురైన వృద్ధులు న్యాయసేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయం పొందొచ్చని జిల్లా న్యాయసేవాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా తెలిపారు. ఖమ్మం గట్టయ్యసెంటర్‌లోని జీవనసంధ్య ఆశ్రమంలో సోమవారం ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని డాక్టర్ భారవితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆతర్వాత ప్రభుత్వ ఆస్పత్రిలోని వయోవృద్ధుల వార్డును సందర్శించి వారి రక్షణకు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే, వైద్యంపై ఆరా తీసి పండ్లు పంపిణీ చేశారు. కాగా, ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని మదర్ థెరిస్సా ఫౌండేషన్‌లో నిర్వహించిన వైద్యశిబిరాన్ని కూడా జడ్జి పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాస్, న్యాయవాది ధర్మేంద్రతో పాటు ఆశ్రమ నిర్వాహకులు, వైద్యులు జి.శ్రీధర్, నారాయణ, సుబ్బారావు, పేరం శ్రీనివాసరావు, దిశ, రేవతి, నాగమణి, సుశీల, రంజాన్‌బీ పాల్గొన్నారు.

అదుపు తప్పిన ద్విచక్రవాహనం

ప్రమాదంలో యువకుడు మృతి

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఓసీ మూలమలుపు సోలార్ ప్లాంట్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఇల్లెందు దో నంబర్ బస్తీకి చెందిన వట్టికోట రాహుల్(20) ద్విచక్రవాహనంపై కారేపల్లిలోని తమ బంధువుల ఇంటి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ ఓసీ మూలమలుపు సోలార్ ప్లాంట్ వద్ద ఆయన ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడ్డాడు. ఈ ఘటనలో రాహుల్ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని కారేపల్లి పోలీసులు తెలిపారు.

ఖమ్మంలో గుంటూరు వాసి మృతి

ఖమ్మంక్రైం: అనారోగ్యంతో గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి మృతి ఖమ్మంలో సోమవారం మృతి చెందాడు. గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన చుండూరు హరి(37) గత 20ఏళ్లుగా బయట తిరుగుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల ఖమ్మంలోని సోదరి ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి సోమవారం బయటకు వెళ్లిన హరి జిల్లా ఆస్పత్రి సమీపాన ఓ రెస్టారెంట్ వద్ద కింద పడి మృతి చెందాడు. ఘటనపై ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై...

భార్య వదిలి పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్థాపంతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఖమ్మం ఆర్డీఓ కార్యాలయ సమీపంలోని ఎం.డీ.అంజాద్(35) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన రోడ్డుపై పడి పోయి కన్నుమూశాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

సత్తుపల్లిరూరల్: మండలంలోని చంద్రాయపాలెంలో కోడిపందేలు స్థావరంపై పోలీసులు ఆ దివారం రాత్రి దాడిచేశారు. పక్కా సమాచారంతో సీఐ మోహన్ బాబు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 11 ద్విచక్రవాహనాలు, ఆరు కోడి పుంజులు, రూ.15,900 నగదు స్వాధీనం చేసుకుని 14మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో వస్తున్న ఉపాధ్యాయుడు

తల్లిదండ్రుల ఆందోళనతో సస్పెండ్ చేసిన డీఈఓ

చింతకాని: పాఠశాలకు ప్రతిరోజు మద్యం తాగొస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చింతకాని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగారు. ఏడాది కాలంగా మద్యం తాగొస్తున్న ఉపాధ్యాయుడు వెంకన్న విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాడని నాలుగు నెలల క్రితం ఎంఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం కూడా ఆయన అలాగే రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈమేరకు ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, మండల వైద్యాధికారి, ఎంపీఓ పాఠశాలకు వచ్చేలోగా సదరు ఉపాధ్యాయుడు రిజిస్టర్‌లో సంతకం చేసి బయటకు వెళ్లిపోయాడు. ఈసందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతతూ ఉపాధ్యాయుడు మద్యం తాగి రావడమే కాక తమ పిల్లలకు అలవాటు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి సుభద్ర, ఎస్ఎంసీ చైర్మన్ కొంపెల్లి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, విచారణ నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడు వెంకన్నను సస్పెండ్ చేస్తూడీఈఓ సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారని ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తెలిపారు.

చేప అరుదు.. తీరు బెదురు



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని కాల్వలో అరుదైన చేప లభించింది. ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి సాయిచరణ్‌కు సోమవారం చూడటానికి వింతగా.. రాయిలా గట్టిగా ఉన్న చేప కనిపించడంతో స్థానిక డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు సదాశివయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా సదాశివయ్య మాట్లాడుతూ 'ఇది హైపోస్టోమస్ ప్లెకోస్టోమస్ అనే విదేశీ చేప. సాధారణంగా దీన్ని సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్ అంటారు. ఇది దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందింది. ఈ చేపలు నీటిలోని నాచు, నీటి మొక్కలతో పాటు నత్తలు, చిన్నచిన్న చేపలు ఇతర నీటి జీవులను తింటాయి. ఇవి ఒళ్లంతా చిన్నపాటి ముళ్లను కలిగి గట్టిగా ఉంటాయి. వీటి నోరు పూర్తిగా కింద భాగాన ఉంటూ నాచును పీల్చడానికి ఉపయోగపడుతుంది. ఇవి దాదాపు అరమీటరు పొడవు పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ చేపను ఆహారంగా తీసుకోరాదు. అక్వేరియంలో నాచును శుభ్రపర్చడానికి మాత్రమే వినియోగించాలి' అని సదాశివయ్య వివరించారు.

60, 70 శాతం ఫీజు తీసుకోండి

ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజుపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు వసూళ్లకు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. మొత్తం ఫీజులో ఏ–కేటగిరీ విద్యార్థుల నుంచి 60 శాతం, బీ–కేటగిరీ విద్యార్థుల నుంచి 70 శాతమే తీసుకోవాలని కాలేజీలను ఆదేశించింది. మిగతా ఫీజు చెల్లింపు ఎలా అన్నది తుది ఉత్తర్వుల్లో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుతూ ప్రభుత్వం జీవో నంబర్ 107ను తీసుకొచ్చిందని, నిబంధనలకు విరుద్ధంగా తీసుకొచ్చిన దీన్ని రద్దు చేయాలని కోరుతూ డాక్టర్ వెంకటదుర్గ అశోక్‌తో పాటు మరో 221 మంది పీజీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ చిల్లకూర్ సుమలత విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపించారు. కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా రెండింటిలోనూ 179 శాతం నుంచి 296 శాతం వరకు ఫీజులు పెంచడం సమర్థనీయం కాదని, చట్టప్రకారం చదువుకునే హక్కును హరించినట్లే అవుతుందన్నారు. ఇప్పటికే ఈ ఫీజులకు సంబంధించిన పిటిషన్ ఇదే హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రస్తుతానికి విద్యార్థుల నుంచి 60 శాతం, 70 శాతం మాత్రమే ఫీజు తీసుకోవాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగాతెలంగాణ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్రానికి చెందిన పలువురు ముఖ్య నేతలను నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన వారిలో మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌తోపాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలున్నారు. మాజీ ఎంపీలు డి.రవీంద్రనాయక్, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రమేశ్ రాథోడ్, చాడ సురేశ్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు టి.రాజేశ్వర్‌రావు, వి.జయపాల్, వన్నాల శ్రీరాములు, జి.రామకృష్ణారెడ్డి, బొడిగె శోభ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయసుధ, ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు.

ధరణితో పేదలను దగా చేశారు

- బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి ధ్వజం
- మాస్టర్‌ప్లాన్ పేరిట భూములు కొల్లగొట్టే యత్నం
- నిర్మల్‌లో ఏలేటికి పరామర్శ.. దీక్ష విరమణ

నిర్మల్: తెలంగాణ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చారని, సీఎంతో పాటు మంత్రి కేటీఆర్ మార్కెటింగ్ బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులను దగా చేశారని ధ్వజమెత్తారు. తాజాగా మాస్టర్ ప్లాన్ పేరుతో రైతుల భూములు కొల్లగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ మార్చాలని జిల్లా కేంద్రంలో ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కిషన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మహేశ్వర్‌రెడ్డి, జిల్లా యువత, రైతులు వారం రోజుల పాటు చేసిన పోరాటం అభినందనీయమని అన్నారు. వీరి కృషి కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గిందని చెప్పారు.



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తూ..

పోరాటంతో దిగివచ్చిన మున్సిపాలిటీ

ఆరురోజులుగా దీక్ష చేస్తున్న ఏలేటిని సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు బలవంతంగా ఆయన ఇంటి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సెలైన్లు పెట్టి వైద్యచికిత్స చేయించారు. అయినా ఆయన నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ క్రమంలో నిర్మల్ వెళ్లిన కిషన్‌రెడ్డి ఏలేటిని పరామర్శించారు. తమ పోరాటానికి నిర్మల్ మున్సిపాలిటీ దిగివచ్చి తీర్మానం చేసిందని తెలిపారు. నిమ్మరసం ఇచ్చి ఆమరణ దీక్ష విరమింపజేశారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల సందర్భంగా పోలీసులు జరిపిన లాఠీచార్జిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను కూడా కిషన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఏలేటి నివాసంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

భూవ్యాపారం దారుణం..

నిర్మల్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూమిని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యుల పేరిట మార్చుకుని భూవ్యాపారం చేయడం దారుణమని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రమంతా ఇదే సమస్య ఉందని, అధికార పార్టీ నాయకులు అక్రమ భూదందాలు చేస్తున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ తో సీఎం పేదలను దగా చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు భూములను తమ ఖాతాలో వేసుకుంటూ మాఫియాలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ధరణి కారణంగా అనేకమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటూ, ఇవన్నీ కేసీఆర్ కుటుంబం చేసిన హత్యలేనని ఆరోపించారు. నిర్మల్‌లో కూడా 260 ఎకరాల భూమిని మంత్రి కుటుంబ సభ్యులకు ప్రభు త్వం ఎందుకు అమ్మేసిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. నయా నిజాం కేసీఆర్‌పై సమష్టిగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

హైకోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన ప్రత్యక్ష ప్రసార సేవలను ప్రారంభించి.. న్యాయవాదులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత 10.30గ. నుంచి కోర్టుల విచారణలు ప్రత్యక్ష ప్రసారమ య్యా యి. ప్రత్యక్ష ప్రసారాలతో న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని సీజే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

లింక్ క్లిక్ చేస్తే...

హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించిన లింక్ ఇచ్చారు. ఈ లింక్ ద్వారా కోర్టును ఎంపిక చేసుకుని ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించవచ్చు. ఫస్ట్ కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారం ఇప్పటికే అందుబాటులో ఉంది. కరోనా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగగా, ఆ తర్వాత హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడుతున్నారు. 2020లో ప్రత్యక్ష ప్రసారాలను అందుబాటులోకి తెచ్చిన గుజరాత్ హైకోర్టు, ఆ తర్వాత యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులు కూడా ప్రత్యక్ష ప్రసారాలు, యూట్యూబ్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ప్రత్యక్ష ప్రసారాలతో పారదర్శకత పెరుగుతుందని న్యాయ నిపుణులు పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, హైకోర్టు, కిందికోర్టుల విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ 2022లో హై కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కూడా దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన నాటి సీజే ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రసారాలకు కావాల్సిన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

లోక్‌సభ ఎన్నికల కోసమేనా..?

కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీపై చర్చ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తో పాటు, కామారెడ్డిని కూడా ఎంచుకోవడం ఉమ్మడి మెదక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2014, 2018 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి ఘన విజయం సాధించిన కేసీఆర్..తన హయాంలో గజ్వేల్ రూపురేఖలు మార్చేశారు. అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారు. తాజాగా ఆయన కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో ఆ నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే రానున్న పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకునే కేసీఆర్ కామారెడ్డిని కూడా ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కామారెడ్డి అసెంబ్లీ స్థానం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. కామారెడ్డిలో పోటీ చేయడం ద్వారా జహీరాబాద్‌తో పాటు, నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు సునాయాసంగా అవుతుందనే ఉద్దేశంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉండి ఉంటారనే చర్చ జరుగుతోంది.



5కిలోల బంగారాన్ని, ఈఓ గీతారెడ్డికి జీయర్‌స్వామి సమక్షంలో అందజేస్తున్న మైహోమ్స్ అధినేత రామేశ్వర్‌రావు దంపతులు.

అతి సుందరం.. కళాత్మకం..

యాదాద్రిని ల్యాండ్ మార్క్‌లా తీర్చిదిద్దిన కేసీఆర్.. ముఖ్యమంత్రిపై చినజీయర్‌స్వామి ప్రశంసలు

యాదగిరిగుట్ట: 'యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధాన ఆలయం అతిసుందరంగా, కళాత్మకంగా నిర్మాణం జరిగింది.. శ్రీస్వామి వైభవానికి ఈ శతాబ్దిలో పెద్ద ల్యాండ్‌మార్క్ అనేలా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారు.. ఇందుకు ముఖ్యమంత్రికి అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను. ఆరంభించిన సంకల్పాన్ని అద్భుతమైన రీతిలో పూర్తి చేసుకున్నారు' అని శ్రీవైష్ణవ పీఠాధిపతి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామిజీ అన్నారు. యాదాద్రీశుడిని సోమవారం దర్శించుకున్న అనంతరం ఉత్తర మాఢ వీధిలో విలేకరులతో మాట్లాడారు. ప్రాచీన కళ యాదాద్రి ఆలయంలో ఉట్టిపడుతోందని, సీఎం కేసీఆర్ యాదాద్రి క్షేత్రాన్ని ప్రాచీన వైభవాన్ని తెలియజేయాలనే రీతిలో నిర్మాణం చేశారన్నారు. ఇంత మంచి కార్యాన్ని నెరవేర్చగలిగే అదృష్టం భగవంతుడు ముఖ్యమంత్రికి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. శ్రీనృసింహస్వామి తెలంగాణ రాష్ట్రానికి రక్షకుడిగా ఉన్నారని, దానికి తగ్గట్లుగా ఆలయ నిర్మాణం జరిగిందన్నారు.

బంగారు తాపడంకోసం 5 కిలోల బంగారం..

విమాన గోపురానికి బంగారు తాపడం కోసం శ్రీస్వామి వారికి డాక్టర్ రామేశ్వర్‌రావు గతంలో ఒక కిలో బంగారం సమర్పిస్తామని వాగ్దానం చేశారని స్వామీజీ తెలిపారు. ఈ కిలోకి మరొక నాలుగు కిలోలను చేర్చి మొత్తంగా 5 కిలోల బంగారాన్ని విమాన గోపురానికి తాపడం కోసం సమర్పించినట్లు జీయర్‌స్వామి చెప్పారు. పెరుమాళ్ల సన్నిధిలో ఆలయ అధికారులకు 5 కిలోల బంగారం డాక్టర్ రామేశ్వర్‌రావు అందజేశారన్నారు.

నిత్య కల్యాణ మండపానికి శంకు స్థాపన..

యాదాద్రి కొండపై గల బాలాలయం ఏర్పాటు చేసిన ప్రాంగణంలో చాలా కాలం శ్రీస్వామి వారు ఉన్నారని, ఆ ప్రాంగణంలో నిత్య కల్యాణం జరిపేందుకు మండపం నిర్మాణం చేసేందుకు పూజలు చేశామని జీయర్‌స్వామి తెలిపారు. త్వరలోనే డాక్టర్ రామేశ్వర్‌రావు ఈ నిర్మాణం పూర్తి చేసే బాధ్యతను స్వీకరిస్తారన్నారు. కాగా, ప్రధానాలయ ఉద్ఘాటన జరిగిన ఏడాదిన్నర తరువాత సోమవారం చినజీయర్ యాదాద్రికి వచ్చారు. ఆయన వెంట త్రిదండి దేవనాథ స్వామి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు ఉన్నారు.



నాగోబా ఆలయానికి పోటెత్తిన భక్తులు

నాగుల పంచమి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

– ఇంద్రవెల్లి

జిల్లా వార్తలు

ఫ్యాక్టరీని సందర్శించిన మేనేజర్



విస్తరణ పనులను పరిశీలిస్తున్న మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో జరుగుతున్న విస్తరణ పనులను ఆయిల్ ఫెడ్ మేనేజర్(ప్రాజెక్ట్స్) శ్రీకాంత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 60 టన్నుల నుంచి 90 టన్నులకు పెంచే క్రమాన నూతనంగా బాయిలర్, వ్యర్థాలను వేరు చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను పరిశీలించాక మేనేజర్ నిర్మాణం పూర్తయిన రైతుల విశ్రాంతి భవనాన్ని కూడా పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కళ్యాణ్, రాజేష్, గోపాల్, విష్ణు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు పరిహారం పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అభివృద్ధి పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన వారికి పరిహారం పెంచాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం ఖమ్మంలో ధర్నా చేపట్టారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తద్వారా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని హేమంతరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, గోవిందరావు, నాయకులు దండి సురేష్, జితేందర్‌రెడ్డి, జానీమియా, కళావతి, మహ్మద్ సలాం, రామ్మూర్తి, వెంకటేశ్వరావు, రవీందర్‌బాబు, రామాంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జన జీవనమే జానపదం

- శ్రమజీవుల మాటల కచేరీకి ప్రతిరూపం
- పాటకు సంగీతం తోడై కళగా రూపాంతరం
- ప్రస్తుత సమాజంలో కొరవడిన ప్రోత్సాహం

నేడు ప్రపంచ జానపద దినోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: సామూహిక జీవన విధానమే జానపదం. గుంపులుగా ఏర్పడిన వారితో జనపదాలు రూపుదిద్దుకున్నాయి. ఆదిమవాసుల తరం నుంచి జన పదాలు ఉండగా.. కాలు కదపంగ ఆట వచ్చి చేరింది. ఆ జనపదాల ఆటపాటలే జానపదమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో విభిన్నమైన జానపదాలు కనిపిస్తాయి. ఇక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో జానపదానికి ప్రత్యేకత ఉంది. బతుకమ్మ ఆటపాటలలో, బోనాల పండుగ, సమ్మక్క, సారలమ్మ ఉత్సవాలు, దసరా పండుగ, సంక్రాంతి సందర్భాల్లో అలరించేవి జానపద ఆటపాటలే.

1846లో తొలిసారి

ఫోక్(జానపదం) అనే పదాన్ని ఇంగ్లాడ్‌కు చెందిన భాషా శాస్త్రవేత్త విలియం జాన్ థారుస్ 1846 ఆగస్టు 22న ఉపయోగించారు. ఆయన స్ఫూర్తితో ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఏటా ఆగస్టు 22న జరుపుకుంటున్నారు. 18వ దశాబ్దంలో తెలుగు నాట జానపదల జీవనంపై అనేక అంశాలు వెలుగు చూశాయి. 19వ శతాబ్దంలో తెలుగు వారి విశిష్ట సాహిత్యం, కళారూపాలు తెరపైకి వచ్చాయి. జానపద జాతర పేరిట ఏటా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వం జానపద ఉత్సవాలను నిర్వహిస్తోంది.

జానపదానిదే పైచేయి

ప్రతీ పనిలో శ్రమను మరిపించేది జానపదం. పాటతో పనిచేస్తే అలుపు సొలుపు ఉండదు. పనిలో అలసట కలగకుండా ఉండేందుకు కర్షక, కార్మికులు సామూహికంగా పాటలు పాడుతుంటారు. ఇక పండుగల్లోనూ ఆటపాటలతో కలిసి ఆనందాలను పంచుకోవటం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో జానపదాల సాంస్కృతిక కార్యక్రమాలు కీలక భూమిక పోషించాయి.

ఉమ్మడి జిల్లాలో 9 వేల మంది

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జానపదాలకు కొదవ లేదు. బిన్నమైన జాతులకు ఖమ్మం పెట్టింది పేరుగా నిలుస్తోంది. ఏజెన్సీ ప్రాంత కొండ జాతులతో పాటు ఆదివాసీలు, బంజారాలు, ఇతర జాతులు, సంచార జాతులు జీవనం సాగిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 9 వేల మంది జానపద కళాకారులు ఉన్నట్లు అంచనా. ఆదివాసీలు పురుషులు తలపాగలు, మహిళలు కొప్పున నెమలి పింఛం ధరించి



కొమ్ము బూర ఊదుతున్న ఆదివాసీ కళాకారుడు

కొమ్ము బూరలు, పెద్ద డోలుతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఆనందాలను పంచుతారు. బంజారాలు ఏకరూప దుస్తులు ధరించి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. తీజ్, దాటుడు వంటి పండుగల్లో భిన్నమైన నృత్యాలు చేస్తారు. బైండ్ల కులస్తులు జమ్మిడికలు, హార్మోనియం వంటి సంగీత పరికరాలతో తమదైన శైలిలో శివరాత్రి జాతరలు, అమ్మవార్ల వేడుకలు వంటి కార్యక్రమాల్లో జానపదాలను వినిపిస్తారు. అలాగే, ఒగ్గుకథలు, బుర్ర కథలు, డప్పు నృత్యాలు, కోలాటాల్లో జడకొప్పు, కోయ నృత్యం, చెక్క భజన, పిట్టల దొర, బుర్రకథ, కాటి కాపరుల, బుడిగ జంగాల జోస్యం, ఎరుకల కథ, సన్నాయి మేళం, ఒంటి చిర్ర కోలాటం వంటివెన్నో ఇక్కడ కనిపిస్తాయి.



కథ చెబుతున్న బైండ్ల జానపద కళాకారులు

కళారూపాలకు జీవం పోయాలి



జానపద కళారూపాలు మరుగున పడుతున్నాయి. ప్రభుత్వం కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలి. సాంస్కృతిక శాఖలోని సారధిలోనూ మాకు స్థానం కల్పించాలి. ప్రజాచైతన్యంలో జానపద కళాకారులను భాగస్వాములను చేస్తే మేలు జరుగుతుంది.

– పమ్మి రవి, పమ్మి, ముదిగొండ మండలం


కళ ఉంది కానీ ఆదరణ లేదు



జానపద కళ ఉన్నా ఆదరించే వారు కరువయ్యారు. కళలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికలు లేకుండా పోయాయి. పండుగలు, వేడుకల్లోనే గుర్తిస్తున్నారు. కళలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేకుండా పోయినందున ప్రభుత్వమే ప్రాధాన్యత ఇవ్వాలి.

– చిన్నపంగు రంజిత్‌కుమార్, పమ్మి, ముదిగొండ మండలం


పథకాల ప్రచారంతో ఉపాధి



ప్రభుత్వ పథకాల ప్రచారంలో జానపద కళాకారులను ఉపయోగించుకుంటే మాకు ఉపాధి లభిస్తుంది. ప్రజల్లోనూ పథకాలపై పూర్తి అవగాహన ఏర్పడుతుంది. నెలలో కనీసం పది రోజుల పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా చూడాలి.

– యంగల కుమారి, కలకోట, బోనకల్ మండలం

సాంకేతికత చేరింది..



జానపదంలోనూ సాంకేతికత వచ్చి చేరింది. పురాతన సంగీత పరికరాల స్థానంలో అధునాతనమైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. జానపదాలను మారుతున్న కాలానికి అన్వయిస్తూ కొత్తగా పాటలు రూపొందిస్తున్నారు. అయినా ఆనాటి జానపదాలను మరువలేం.

– గోవింద గురువయ్య, ఎర్రగడ్డ, తిరుమలాయపాలెం మండలం

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలి

గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్ర సేథ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో రాజ్యాంగ వ్యతిరేకంగా, అవినీతి పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని సాగనంపాలని గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్ర సేథ్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వాన బలమైన శక్తిగా ఎదుగుతున్నామని, రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. ప్రపంచ దేశాలకు దీటుగా భారత్‌ను మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కానీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాత్రం కుటుంబపాలనగా ప్రఖ్యాతి చెందాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, నిరుద్యోగ భృతి తదితర హామీలనే విస్మరించడమే కాక ఎన్నికల వేళ కొత్త పథకాలతో మోసానికి తెర తీశారని ఆరోపించారు. కాగా, ఈనెల 27న



మాట్లాడుతున్న గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్రసేథ్

ఖమ్మంలో జరిగే సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరవుతున్నందున భారీగా తరలిరావాలని వారు కోరారు. ఈసమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉప్పల శారద, నాయకులు రుద్ర ప్రదీప్, మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, ఆచంటి కోటేశ్వరావు, డీకొండ శ్యాం, బోయినపల్లి చంద్రశేఖర్, జ్వాలా నర్సింహారావు, గజ్జల శ్రీనివాస్, మధు, దాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రేమేంద్ర సేథ్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు రుద్రగాని మాధవ్‌గౌడ్, ఉదయ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

ఒక మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధి బట్టేవాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు ప్లాటూన్ 16వ నంబర్‌కు చెందిన కమాండర్ మల్లేష్, ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యురాలు విమల, ఓర్చా ఎల్‌ఓఎస్ కమాండర్ దీపక్, ఓర్చా ఎల్‌జీఎస్ కమాండర్ రాంలాల్ తదితరులు సంచరిస్తున్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాల పైకి కాల్పులు జరుపుతూ పారిపోతుండగా పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. హోరాహోరీగా సాగిన కాల్పుల్లో ఒక గుర్తు తెలియని మావోయిస్టు మృతి చెందగా, మిగిలిన వారు పారిపోయారు. ఘటనాస్థలం నుంచి ఒక 315 బోర్ రైఫిల్, 2 బోర్ రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తప్పించుకున్న మావోల కోసం కూంబింగ్ ముమ్మరం చేశారు.

బీజాపూర్ జిల్లాలో 40 మంది కిడ్నాప్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివాసీలు నిర్వహిస్తున్న ఒక జాతరకు హాజరైన వారిలో 40 మందిని మావోయిస్టులు ఆదివారం సాయంత్రం కిడ్నాప్ చేశారు. కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్సేఘఢ్ సమీపంలో జరిగిన జాతరకు సమీప గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. వారిలో 40 మందిని మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. వారిలో పర్సేఘఢ్‌కు చెందిన మాజీ సర్పంచ్ మహేష్ గుట్టంను అదుపులో ఉంచుకుని మిగిలిన 39 మందిని సోమవారం ఉదయం విడుదల చేశారు. మహేష్ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతోనే అదుపులో ఉంచుకున్నారని సమాచారం. కాగా, అతడికి ప్రాణహాని తలపెట్టకుండా క్షేమంగా విడిచిపెట్టాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

నైపుణ్యం పెంపునకు శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు పునశ్చరణ శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయని సింగరేణి జీఎం(సెక్యూరిటీ) బీఆర్.దీక్షితులు తెలిపారు. కొత్తగూడెంలోని ఎస్ అండ్ పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో సెక్యూరిటీ సిబ్బందికి 73వ బ్యాచ్ శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు నిరంతరం నేర్చుకుంటుండడం ద్వారా వృత్తిలో మెళకువలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న అంశాల ఆధారంగా వృత్తిలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. అధికారులు వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఛత్తీస్‌గఢ్ మంత్రి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఛత్తీస్‌గఢ్ మంత్రి కావసి లక్మ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అలాగే, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా, పండితులు ఆలయ విశిష్టతను వివరించి వేదాశీర్వచనం అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సరెళ్ల నరేష్, బలుసు నాగ సతీష్, వెంకటేష్, రాగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.